క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మించారు.. రోడ్డు మరిచారు



రోడ్డు వేయకపోవడంతో బయటకు వచ్చిన మెటల్స్

దెందులూరు: మూడు నియోజకవర్గ ప్రయాణికులు, పాదచారులకు ఉపయోగపడే గుండుగొలను బ్రిడ్జి నిర్మాణం చేశారు. బ్రిడ్జికి మెయిన్ రోడ్డుకి మధ్య రోడ్డు నిర్మించలేదు. పది మీటర్ల రోడ్డు నిర్మాణం చేస్తే బ్రిడ్జి రోడ్డు మెయిన్ రోడ్డు కలిసి పోయేదని 80 శాతం పని చేసి అవసరమైన రోడ్డును వేయకపోవడం ఏమిటని ఈ రోడ్డుపై ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని వర్షాలకు పటిష్టమైన రోడ్డు లేకపోతే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

మానవత సేవలు మరింత విస్తృతం



బువ్వనపల్లిలో హాజరైన మానవత సభ్యులు

నిడమర్రు: మానవత సేవలు గ్రామాల్లో మరింత విస్తృతం చేసేలా మానవత సభ్యులు కృషి చేయాలని మండల అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేష్ అన్నారు. ఆదివారం మండల మానవత సమీక్షా సమావేశం బువ్వనపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ అల్లుమోలు అంతిర్వేది స్నేహితునితో రూ.25 వేలు పలు సేవా కార్యక్రమాల నిమిత్తం ఆర్థిక సహాయం మండల కమిటీకి అందించారు. ఈ సమావేశంలో జిల్లా సభ్యులు నౌడు వెంకట అచ్యుత రామారావు, కార్యదర్శి సంకు శ్రీను, అలుమోలు ప్రసాద్, కోడూరి మణి తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నిడమర్రు: స్థానిక మండల పరిషత్ భవనంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిడమర్రు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులతో పాటు మండలంలోని మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొడనాలని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

భీమడోలు: గుండుగొలనులోని బీసీ కాలనీ, జగనన్న హౌసింగ్ కాలనీల్లో రూ.1.15 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో జగనన్న హౌసింగ్ కాలనీలో రూ.45 లక్షలతో గ్రావెల్ రోడ్లు, బీసీ కాలనీలో రూ.70 లక్షలతో సీసీ రోడ్లును నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు వినతిపత్రాలు అందించారు.

ఆర్చరీ పోటీల్లో విజేతలకు అభినందనలు



ఆర్చరీ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల బృందం

చింతలపూడి: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ఈ నెల 26న నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల ఆర్చరీ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు యూనివర్సిటీ ఆర్చరీ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన యూనివర్సిటీ జట్టు గురుకాసి యూనివర్సిటీ పంజాబ్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.అంజద్ ఆలీ ఆదివారం తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ డా.అంజద్ ఆలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు అభినందించారు.

కొయ్యలగూడెం విద్యార్థికి రాష్ట్రస్థాయి పతకం

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి మూడో స్థానంలో నిలిచినట్లు వీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ స్వామి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు బీఆర్ ఒలింపియాడ్‌లో ఏర్పాటుచేసిన గేమ్స్‌లో ఇంటర్ విద్యార్థిని పాకా దుర్గా మధురశ్రీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించిందన్నారు. దీంతో జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని మధురశ్రీని పలువురు అభినందించారు.

మూగజీవాలకు సీజనల్ ముప్పు

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి
- అక్టోబర్ 15 వరకు టీకాలకు అవకాశం



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

నిడమర్రు: వాతావరణంలో మార్పులు, ఉపరితల ఆవర్తనంతో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో విపరీగా కురుస్తున్న వర్షాలు మూగ జీవాలపై ప్రభావం చూపుతాయని పశు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని చెబుతున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పెంపకందారులు నష్టపోవాల్సి వస్తుందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 15వ తేదీ వరకూ నిర్వహిస్తున్నారు. పశువుల్లో సోకే వ్యాధుల్లో గాలి కుంటు వ్యాధి ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలను పాడి రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని పశు వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఈ వ్యాధి నివారణపై పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు టీకాల కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తుంది.

పశువుల్లో ఇలా గుర్తించాలి

పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలను సులువుగా గుర్తించొచ్చని పశువైద్య సిబ్బంది చెబుతున్నారు. పశువుల్లో తీవ్రమైన జ్వరం రావడంతో పాటు నీరసించిపోతాయి. నోటి నుంచి తీగల వలే సొంగ కారుతూ ఉంటుంది. నోటి వద్ద, కాలి గిట్టల వద్ద పుండ్లు ఏర్పడతాయి. కొద్దిపాటి ఎండకు కూడా ఇవి తట్టుకోలేవు. చూడి పశువులు అయితే ఈనుకుపోతాయి. వీటి పాలు తాగే దూడలు మరణిస్తాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో పాటు పశువుల పని సామర్థ్యం అంతే స్థాయిలో తగ్గుతుంది. దీని వలన పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వైద్యంపై నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయి. ఈ వ్యాధికి టీకాలే పరిష్కామరమని వైద్యులు చెబుతున్నారు.

నివారణ ఇలా..

నాలుగు నెలల వయసు దాటిన పశువులు, జీవాలకు ముందు జాగ్రత్త చర్యగా ఈ గాలికుంటు వ్యాధి టీకా వేయించాలి. ఆవులు, గేదెలకు 2 మిల్లీ లీటర్ల చొప్పున టీకా ఇవ్వాలి. ఆరు నెలలకోసారి టీకా వేయిస్తే గాలికుంటు వ్యాధి దరి చేరదు, ప్రభుత్వం ఉచితంగా టీకా వేస్తుంది. దీని వలన పాడి రైతుకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పని సామర్థ్యం తగ్గకుండా కాపాడొచ్చు. దూడల్లో మరణాలు సంభవించవు. అవి ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు ఉపయోగపడతాయి.

సద్వినియోగం చేసుకోవాలి



గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 15వ తేదీ నుంచి టీకాలు ప్రారంభించాం. షెడ్యూల్ ప్రకారం ఈనెల 30వ తేదీతో మండలంలో ముగుస్తుంది. అయినా వచ్చే నెల 15 వరకూ ఈ టీకాల డోసులు అందుబాటులో ఉంటాయి. పాడి రైతులు వినియోగించుకోవాలి.

– వి.సందీప్, మండల పశు వైద్యాధికారి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖర్

పెదపాడు: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెదవేగి సీఐ రాజశేఖర్ తెలిపారు. మహిళలు, బాలికల కోసం పోక్సో, 354 సెక్షన్లు ఉన్నాయని చెప్పారు. సైబర్ నేరాల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. డ్రగ్స్, మద్యం దుర్వినియోగంపై చర్యలు చేపడతామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాలల హక్కులను వివరించారు. బాల్యవివాహాల నివారణకు ప్రజలకు సహకారం అవసరమని చెప్పారు. పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో సమాజాన్ని శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని చెప్పారు. చేపల చెరువులు సాగు చేసే కొంతమంది స్వార్థపరులు కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నారని వాటి వలన పర్యారణానికి హాని కలుగుతుందన్నారు. ఎవరైనా పర్యావరణానికి హాని కలిగిస్తే వివరాలను తనకు తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

30న అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన



గొల్ల కిరణ్, గంటా పండు

దెందులూరు: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 30న అన్ని చోట్ల ఉన్న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శులు గొల్ల కిరణ్, గంటా పండు కోరారు. ఆదివారం కొవ్వలిలో విలేకరులతో మాట్లాడుతూ పేదలకు ఉచితంగా విద్య వైద్యం శాశ్వతంగా అందాలన్న దృక్పథంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశానికే ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దరన్నారు. దాదాపు మూడు వేల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారని తెలిపారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యాన్ని, విద్యను దూరం చేసే విధంగా తీసుకున్న నిర్ణయం పేదలకు శాపమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎండగట్టకపోతే పేదలు విద్యకు, వైద్యానికి దూరమవుతారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఈనెల 30న నిరసనను కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర కార్యదర్శులు గొల్ల కిరణ్, గంటా పండు కోరారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సాల్వేషన్ ఆర్మీ, సంఘ పెద్దలు

దెందులూరు: ప్రభుత్వం చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి, మానవ అక్రమ రవాణా అరికట్టాలని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, రిటైర్డ్ టెరిటోరియల్ కమాండర్ జోషియా అన్నారు. ఆదివారం సాల్వేషన్ ఆర్మీ మెయిన్ చర్చి గౌడ వీధిలోని మిలీనియం చర్చిలో యాంటీ విమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కోర్ ఆఫీసర్ రమణయ్య ప్రారంభించారు. గౌడ వీధి మంచినీటి చెరువు, బస్టాండ్ సెంటర్, మెయిన్ చర్చ్ వైఎస్సార్ సర్కిల్ మీదుగా ర్యాలీ చేశారు. టీచర్ కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ పేదరికం నిరక్షరాస్యత మోసపూరిత వాగ్దానాలు నిరుద్యోగం ఉమెన్ ట్రాఫికింగ్‌కి ప్రధాన కారణాలు అన్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలన్నారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా చదివించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి, హక్కులు, బాధ్యత, చట్టాలు శిక్షలు సమాజంలో పరిస్థితులు అవగాహన కలుగుతాయన్నారు.

ఉచిత పంటల బీమా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

దెందులూరు: గత ప్రభుత్వంలో అమలు చేసినట్లుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని, 2024 ఖరీఫ్ సీజన్ పంటల బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీమా ప్రీమియం స్వచ్ఛంద నమోదు పద్ధతిలో రైతులు చెల్లించి నమోదు చేసుకోవాలని, 2024 రబీ సీజన్ నుంచి ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తుందని చెప్పారు. వాతావరణ బీమా, దిగుబడి ఆధారిత బీమా పేరుతో ప్రైవేటు ఇన్స్యూరెన్స్ కంపెనీలు రైతుల వాటాగా చెల్లించాల్సిన బీమా ప్రీమియం మొత్తాన్ని భారీగా పెంచాయన్నారు. పత్తికి హెక్టారుకు రూ.5 వేలు, మిరపకు రూ.11,250, వరికి రూ.2,150 ఇలా ప్రీమియం మొత్తం అధికంగా ఉండటంతో 14.15 లక్షల ఎకరాలకు మాత్రమే బీమా ప్రీమియం రైతులు చెల్లించారన్నా రు. ఇంకా 57లక్షల ఎకరాలకు బీమా దక్కలేదన్నా రు. 75లక్షల మందికి పైగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితి నివారించి రైతులందరికి బీమా ప్రయోజనం దక్కేలా ప్రభుత్వ మే ఉచిత పంటలబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గుర్రం జాషువా జీవితం ఆదర్శనీయం



గుర్రం జాషువా చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉమా మహేశ్వరరావు

భీమడోలు: సమాజ సంస్కర్త, దళిత కవి, పద్మభూషణ్ గుర్రం జాషువా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలను వివరించారు. అదే విధంగా గుర్రం జాషువా జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. భీమడోలులో గుర్రం జాషువా చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తుమ్మల ఉమ మహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ అణగారిని వర్గాల అభ్యున్నతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన రాసిన గబ్బిలం, ఫిలదౌసి తదితర నవలలు సమాజాన్ని జాగృతం చేశాయన్నారు. నవలలు, కవితల్లో చక్కని సందేశాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకుని విద్యార్థి దశ నుంచి ఉత్తమంగా తీర్చిదిద్దబడాలని కోరారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకుడు డీఎస్‌వీ అమర్‌నాథ్, కె.శ్రీనివాసరావు, జి.బంగారుపాప, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య సేవలు

కొయ్యలగూడెం: మానవత సంస్థ ఆధ్వర్యాన ఆదివారం సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం వీఎస్ఎన్ కళాశాలలో నిర్వహించారు. హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సిద్ధ ఆయుర్వేద వైద్యులు చింతల జగదీష్, బీహెచ్ శ్రీనాథ్ సుమారు రెండు వందల మందికి సిద్ధ ఆయుర్వేద చికిత్సను అందించి ఔషధాలు పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సిద్ధయోగ ఆయుర్వేద బొమ్మ మోహన్ వైద్యం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అద్దేపల్లి అంజిబాబు, స్వాతి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. గోదావరి డయాగ్నోస్టిక్ ల్యాబ్, రాజమండ్రి రాయల్ హాస్పటల్ వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందించారు. తొలుత గుర్రం జాషువా జయంతి నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

లింగపాలెం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి, కలరాయునగూడెం సర్పంచ్ చల్లగుళ్ల రవిబాబు తల్లి శ్యామల ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, పలువురు నాయకులు ఆదివారం రవిబాబు నివాసానికి వెళ్లి ఆయన తల్లి శ్యామలకు నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు తపనా చౌదరి, బీజేపీ ఏలూరు జిల్లా పార్లమెంటు కన్వీనర్ కె కృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు రాజానాయన, కొల్లి అనీల్ కుమార్, ఆళ్ల సతీష్ చౌదరి, చలగుళ్ల సూరిబాబు తదితరులు రవిబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వైభవంగా శరన్నవరాత్రులు



నిడమర్రు: పార్వతీదేవిగా..



నిడమర్రు: మహాచండీదేవిగా..



భీమడోలు: శ్రీమహాచండీదేవిగా భవానమ్మ

నిడమర్రు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడో రోజు అమ్మవారు పలు అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పెదనింద్రకొలనులో పార్వతీ దేవిగా, మందలపర్రులో ఉమాదేవి మహాచండీ దేవిగా, బువ్వనపల్లిలో చక్రధారిణి అమ్మవారిగా భక్తులకు దర్శనిమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

అమ్మవారి ఊరేగింపు

దెందులూరు: దసరా మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం మహా చండీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామవరంలో శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు విశిష్ట అలంకరణ చేశారు. దెందులూరు, గంగన్నగూడెం, జోగన్నపాలెం, రామారావుగూడెం, చల్ల చింతలపూడి, పోతునూరు, ఉండ్రాజవరం, దోసపాడు, గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులు ప్రసాదాలు

ప్రత్యేక పూజలు

పెదపాడు: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపాడులోని గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోనూ, బళ్లరేవు తూము సెంటర్‌లోని కనకదుర్గమ్మ, కొత్తూరులోని కనకదుర్గమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వసంతవాడ, అప్పనవీడులోని కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



పెదపాడు: పార్వతీదేవికి గాజులు, పసుపు, కుంకుమ సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

గాయత్రీదేవిగా అమ్మవారు

భీమడోలు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఏడో రోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు భవానీ మాతకు విశేష పూజలు చేశారు. భీమడోలు గ్రామంలోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, భీమడోలు జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు. గుండుగొలనులో శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్ శర్మ, లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గుండుగొలనులోని శ్రీవేంకటేశ్వర స్వామి వారిని తహసీల్దార్ బి.రమాదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం భవానమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీమహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరెడ్లగూడెంలోని గద్దెపై అమ్మవారికి పూజలు చేశారు. కురెళ్లగూడెం అమ్మ వారిని రూ.5 లక్షలతో అలంకరించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు పాల్గొన్నారు.



దెందులూరు: అమ్మవారిని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీదేవి, దేవమ్మ సంబరాలు ప్రారంభం


భీమడోలు: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామదేవత శ్రీదేవి దేవమ్మ వార్షిక సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిఏటా ఐదు రోజుల పాటు ఈ సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రాజరాజేశ్వరి దేవికి పూజలు

పెదవేగి: దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకుని గ్రామాల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పెదవేగి మండలం రాయన్నపాలెం కొత్తూరులో తెల్లవారు జామున, సాయంత్రం మహిళలు సామూహికంగా అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహిస్తున్నారు.

24వ డివిజన్‌లో సమస్యల తిష్ట

- డ్రెయినేజీ సమస్య తీవ్రం
- దోమలు, పందులతో నిత్యం అవస్థలు



రెడ్డమ్మ స్ట్రీట్‌లో 2వ రోడ్డులో ఇళ్ల మధ్యే మురుగుకూపం

ఏలూరు రూరల్: ఏళ్ల తరబడిన మా సమస్య పరిష్కారం కావడం లేదని ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి 24వ డివిజన్ జేవీఆర్ నగర్ ప్రజలు వేడుకుంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇళ్లల్లో వాడుక నీరు లోతట్టు ప్రాంతాల్లో చేరి మురుగుకూపాలుగా మారుతున్నాయని వాపోతున్నారు. దోమలు, పందులతో సహవాసం చేయాల్సి దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా సమస్య కన్నెత్తి చూసే నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సమస్య పరిష్కరించకపోయిన ప్పటికీ క్రమం తప్పకుండా ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూలు చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు వచ్చి మీ సమస్య పరిష్కరిస్తాం అంటూ వాగ్దానాలు చేశారని, ఎన్నికలు పూర్తికాగానే మరిచిపోయారని ఎద్దేవా చేస్తున్నారు.

నివాసాల మధ్య మురుగు

స్థానిక రెడ్డమ్మ స్ట్రీట్‌లో 1, 2 రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థలేదు. ఈ ప్రాంతంలో సుమారు 40కు పైగా భవనాలు, ఇళ్లు ఉన్నాయి. ఈ భవనాల్లో వాడుక నీరు బయటకు పోయే దారిలేకపోవడంతో లోతట్టు స్థలాల్లో చేరుతోంది. దీంతో పందులు సంచారం పెరిగి, పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుంది. దీనికి తోడు దోమలు సైతం వృద్ధి చెందుతున్నాయి. ఫలి తంగా స్థానికులు దోమలతో వేగలేక చీకటిపడగానే కిటికీలు, తలుపులు మూసుకుంటున్నారు. అయినప్పటికీ దోమల బెడదతో పిల్లలు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారని మహిళలు వాపోతున్నారు. వర్షాకాలంలో వీరి బాధలు రెట్టింపవుతున్నాయి. మురుగునీటితో పాటు వర్షం నీరు సైతం ఖాళీ స్థలాల్లో చేరి పరిసరాలను మరింత అధ్వానంగా మారుతున్నాయి. వర్షాకాలంలో మురుగుకూపా లు మారుతున్న స్థలాలు వేసవి కాలం వరకూ సమస్యలు సృష్టిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

ఈ ప్రాంతో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయకపోవడం వల్ల ప్రజలు పడుతున్న అవస్థలను వివరిస్తూ స్థానికుడు ఎం.సూర్యచంద్రరావు కొద్దికాలం క్రితం జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు సైతం బుట్టదాఖలైంది. కార్పొరేషన్ అధికారులు ఫిర్యాదుపై కనీసం స్పందించలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రెయినేజీ అభివృద్ధిచేయాలని కోరుతున్నారు.

పందులు పెరిగిపోయాయి



ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరడం వల్ల పందులు పెరిగిపోయాయి. రాత్రి, పగలు ఇళ్ల మధ్య ఉంటున్నాయి. కొన్ని నెలల క్రితం ఒకటి లేదా రెండు పందులు ఉండేవి. ఇప్పుడు ఏకంగా పదుల సంఖ్యలో పందులు వస్తున్నాయి. వీటివల్ల ఒక్కటే దర్వాసన. పందుల కారణంగా ఇంటిలో కూడా ఉండలేకపోతున్నాం. కనీసం పందులను నివారించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఎం.సాయిదుర్గ, స్థానికురాలు